## హుస్నాబాద్ వాసులకు దళిత రత్న పురస్కారం



అవార్డులు అందుకున్న దృశ్యం

**హుస్నాబాద్, ఏప్రిల్16, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణానికి చెందిన సామాజిక సేవకులు సావుల రాజమౌళి, బోజు రవిందర్, సావుల వెంకట్‌లకు దళిత రత్న పురస్కారం అందింది. ఈ మేరకు శుక్రవారం రోజున హైదరాబాద్‌లో జరిగిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహా విష్కరణ కార్యక్రమం అనంతరం వారు చేస్తున్న సామాజిక కార్యక్రమాలను గుర్తించిన షెడ్యూల్ కులాల శాఖ కమిషనర్ శ్రీనివా స్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, ఉత్సవ కమిటీ చైర్మెన్ జంగా శ్రీనివాస్, మాల మహానాడు జాతీయ అధ్యక్షు డు చెన్నయ్య చేతుల మీదుగా ఈ అవార్డు ప్రధానం చేసినట్లు రాజమౌళి శనివారం రోజున తెలిపారు. అంతే కాకుండా పట్టనానికి చెందిన సావుల శ్రీనివాస్, సావుల చిన్న శ్రీనివాస్‌లకు సైతం దళిత యువ తర్న అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## చెట్లను నరికివేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు



విచారణ చేస్తున్న అటవీ శాఖ అధికారులు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలంలోని గొల్లకుంట గిరిజన తండా అటవీ ప్రాంతం వ్యవసాయ సరిహద్దుల్లో కొందరు చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారని సమాచారం మేరకు పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు శనివారం ఘనట స్థలానికి చేరుకున్నారు. చెట్లను నరికి నిల్వ ఉంచిన కట్టెలను గమనించారు. తండాకు చెందిన కెతావత్ సుభాష్, కెతావత్ సర్దార్‌లను గుర్తిం చి వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా చెట్లను నరివేసినట్లయితే తమకు ఎలాంటి సమా చారం అందినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయనతో పాటు అట వీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మాన సభకు హాజరైన డైరెక్టర్లు

## ఇప్పేపల్లి సొసైటీ చైర్మనపై నెగ్గిన అవిశ్వాసం

### -17న కొత్త చైర్మన్ ఎంపిక

**జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్‌పై డైరెక్టర్‌లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సొసైటీ చైర్మన్‌గా కిషన్ రావు పవార్ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే సొసైటీ డైరెక్టర్లు మార్చి 17న అవిశ్వాస తీర్మానంకై తీర్మాన పత్రాన్ని డిసిఓ ప్రసాద్‌కు అందచేశారు. శనివారం ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మాన కార్యక్రమానికి 9 మంది సొసైటీ డైరెక్టర్లు హాజరయ్యారు. సొసైటీలో 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ ఇటీవలే మృతి చెందారు. ఉన్న 12 మంది డైరెక్టర్లలో 9 మంది డైరెక్టర్లు సమా వేశానికి హాజరైనట్లు డిసిఓ ప్రసాద్ తెలిపారు. అవిశ్వాస తీర్మా నానికి మూడో వంతు మద్దతు ఉండటంతో చైర్మన్ కిషన్ రావు పవార్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అధికారి ప్రకటించారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు పట్టణంలోని సుభాష్‌గం జ్‌లోని ఇప్పేపల్లి సొసైటీ కార్యాలయంలో కొత్త చైర్మన్ ఎంపిక ఉంటుందని అధికారి వివరించారు. అవిశ్వాస తీర్మానం ప్రశాంతంగా ముగిసేలా అలజడులకు ఆస్కారం లేకుండా పట్టణ సిఐ తోట భూపతి, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు తగు నిఘా ఏర్పాటు చేశారు. ఏదేమైనా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో బిఆర్ఎస్ పార్టీలో అసమ్మతి బగ్గుమన్నది.

## డబుల్ ఇళ్లల్లో పెండింగ్‌లో పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలి

### -జిల్లా కలెక్టర్ రాజర్షిషా



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, ఏప్రిల్15 ప్రభాతవార్త:** డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను పక్షం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులకు, ఏజెన్సీలకు సూచించారు. శనివారం పిల్లికొట్టాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను, మౌలిక సదుపాయల కల్పనను పరిశీలించి లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఇంకా మిగిలిపోయిన ఎలక్ట్రిఫికేషన్, డ్రైనేజి, పెయింటింగ్ పనులు, కిటికీలకు అద్దాలు బిగించడం, మంచి నీటి ట్యాంకులు, ప్లంబింగ్ వంటి చిన్న చిన్న పనులు యాద్ధ ప్రాతిపదికన పక్షం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన పరిపాలన అనుమతులను వెంటనే మంజూరు చేస్తామన్నారు. క్రీడా మైదానం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు అందుబాటులో నూతనంగా రేషన్ దుకాణం, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పంచాయితీ రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగరావు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కమీషనర్ జానకిరామ్ సాగర్, తహశీల్దార్ శ్రీనివాస్, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

### రహదారులు బాగుంటేనే రవాణా రంగం అభివృద్ధి

రహదారులు బాగుంటేనే రవాణా రంగం అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు దూరభారం తగ్గి సుఖ ప్రయాణం చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణం, పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించిందని, ఆ దిశగా త్వరితగతిన టెండర్లు ఆహ్వానించి పనులు మొదలు పెట్టవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శనివారం తన ఛాంబర్‌లో ఆందోల్ శాసన సభ్యులు చంటి కాంత్రి కిరణ్‌తో కలిసి ఆందోల్ నియోజకవర్గంలో రహదారులు, భవనాలు, పంచాయితీ రాజ్ శాఖల ద్వారా వివిధ పథకాల క్రింద చేపట్టి బీటీ రెన్యువల్స్ పై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ ద్వారా 2021-22, 2022-23 సంవత్సరాల్లో 32 కిలో మీట్లర్ల మేర బీటీ రోడ్డు పునరుద్ధరణకు 8 పనులు మంజూరు కాగా కేవలం ఒక పనికి మాత్రమే టెండరు వచ్చిందని, మిగతా వాటికి కూడా టెండర్లు మరోమారు ఆహ్వానించి వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పంచాయితీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్వహణ, వరద నష్ట ఉపశమనం, స్పెషల్ డెవెలప్‌మెంట్ ఫండ్ క్రింద 28 పనులకు సంబంధించి ఇంత వరకు టెండర్లు రాని వాటికి మరోమారు టెండర్లు ఆహ్వానించి, వెంటనే పనులు చేపట్టుటకు చొరవ చూపాలని పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఇంచార్జి ఈఈ సురేష్, డిప్యూటీ ఈఈ వెంకటేష్ పంచాయితీ రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 20 వ రోజుకు చేరిన రెవెన్యూ డివిజన్ నిరాహార దీక్షలు

**రామాయంపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే డిమాండ్‌తో అఖిలపక్షం నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ నాయకులు మాట్లా డుతూ రామాయంపేట ప్రజల, వ్యాపారస్తుల డిమాండ్ అయిన రెవెన్యూ డివిజన్‌ను వెంటనే ఏర్పాటు చేసి రామాయంపేట ప్రజల కష్టాలను తీర్చాలని, అలాగే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ రామా యంపేట పట్టణంను అభివృద్ధి చేయాలని కోరారు. గత 20 రోజులుగా మండుటెండలలో రెవెన్యూ డివిజన్ కోసం పోరాటాలు చేస్తుంటే, ఇప్పటివరకు అధికార పార్టీ నాయకులు స్పందించకపో వడం రామాయంపేట ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు.

# అటవీ భూమి హాంఫట్

## చెట్లను నరికేసి కబ్జా చేస్తున్న వైనం
## అడ్డుకునే అటవీ అధికారులపై దాడులు
## ఠాణాలో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయరు



అప్పట్లో అటవీ భూమి



అటవీ భూమిలో మొక్కలు పెంచుతున్న దృశ్యం

**పాపన్నపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** జనజీవన స్రవంతిలో అడువులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవవసరాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిత హారం కార్యక్రమంతో గ్రామ శివారు ప్రాంతాలను అటవీ ప్రాంతంగా మార్చేందుకు మొక్కలు నాటుతూ వేలాదిగా ఖర్చులు చేస్తోంది. తెలంగాణ హరిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంది. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు గార్చేలా కొందరు అక్రమార్కులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్నా అధికారులకు పట్టక పోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అటవీ భూమలును రక్షించాల్సిన అధికారులు అక్రమార్కులకు అడ్డుతగిలితే దాడులు చేస్తూ ఆస్పత్రుల పాలుచేస్తున్న సంఘటనలు సైతం మండలంలో ఉన్నాయంటే అక్రమార్కుల ఆగడాలపై ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బంగారు కత్తి అని గొంతుకోసుకుంటామా అన్నట్లుగా జీతభత్యాల కోసం అక్రమార్కులతో గొడవలెందుకని అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### పోడు భూములతో అడవుల ఆక్రమణ

పోడు భూముల సమస్యతో అడవులు ఆక్రమణకు నెలవులుగా మారాయి. పోడు భూములను రైతులకు భూమి హక్కు కల్పిస్తామని ప్రకటించడంతో ఆక్రమార్కులు, ఆశావాహుల కన్ను అటవీ భూములపై పడింది. అటవీ భూమిలోని చెట్లను నరికేస్తూ యదేశ్చగా ఆక్రమణకు పూనుకుంటున్నారు. మండల పరిధిలోని కంపార్ట్‌మెంట్ 70లో 50 హెక్టార్ల వరకు అటవీ భూమిలో హరిత హారంలో నాటిన మొక్కలను అక్రమార్కులు తొలగించి ఆక్రమణకు దారితీశారు. ఆక్రమణకు అడ్డుకునేందుకు వెళ్లిన అటవీ అధికారులపై దాడులు సైతం చేసి ఆసుత్రుల పాలు చేశారు. 1999-2020 మధ్య కాలంలో కాంపార్ట్‌మెంట్ 70లో నీలగిరి మొక్కలు నాటి పెంచి పోషించారు. 2022లో నిలగిరి చెట్లు ఏపుగా పెరగడంతో వాటిని తొలగించి సదరు స్థలంలో మిశ్రమ మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. పోడు భూములపై రైతులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సమాయత్తం కావడంతో కొందరు కబ్జాకోరులు అటవీ భూములను దక్కించుకునేందుకు అడ్డగోలుగా నాటిన మొక్కలను తొలగించి భూములను రాత్రికి రాత్రే చదును చేసుకునే పనిలో పడ్డారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అడ్డుకునేందుకు వెళితే కబ్జాకోరులు అధికారులపై దాడు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

### అరికట్టేందుకు వెళితే దాడులు

మండలంలోని నయపూర్, చిత్రియల్ తండా, అమీంంరియ ఒడా, అన్నారం, అబలాపూర్, నగ్సాన్‌పల్లి తదితర గ్రామాల పరిధిలో అటవీ భూములు ఆక్రమణకు గురికావడంతో కంపార్ట్‌మెంట్‌లలో అటవీ భూములలో ఆక్రమ దారులు చొరబడుతున్నారని తెలుసుకున్న అధికారులు తమ సిబ్బందితో రాత్రిని సైతం లెక్కచేయకుండా సదరు ప్రాంతాలకు వెళ్లిన వారిపై దాడులు చేయడంతో అధికారుల్లో భయం నిండుకుందని తెలుస్తోంది. దాడులకు భయపడిన అధికారులు ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా చూసి చూడనట్లుగా ఉంటున్నారన్న పుకార్లు వినవస్తున్నాయి.

### కేసులతోనే సరి...చర్య లేవి?

చిన్నపాటి మొక్కలను తొలగిస్తే రాద్ధాంతం చేస్తూ కేసులు, జరిమానాలు వేస్తున్న అధికారులు 50 హెక్టార్ల మేర అటవీ భూముల్లో లక్ష్యలు వెచ్చించి పెంచుతున్న మొక్కలను తొలగించేసి భూములను చదును చేస్తున్నా అటవీ శాఖ ఉన్నతాధికారులు చోద్యం చూడడం సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను ద్వంసం చేసిన వారిపై కేవలం కేసులు మాత్రమే నమోదు చేసి చర్యలు లేకుండా చేశారు.

అటవీ భూముల ఆక్రమణ విషయాన్ని ప్రభాతవార్త పాపన్నపేట సెక్షన్ అధికారి దృష్టికి తీసుకుపోగా కంపార్ట్‌మెంట్ 70లో స్థానికులు అటవీ భూములో పెంచుతున్న మొక్కలను తొలగించి ఆక్రమణకు పాల్పడిన విష యం వాస్తమే అన్నారు. కబ్జాను అడ్డుకునేందుకు వెళితే దాడులు చేస్తున్నారని భయాందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి జాతీయ అటవీ భూములను రక్షించి భూ ఆక్రమణను అరికట్టాలని ప్రజలు వినతి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



గతంలో అటవీ అధికారులపై దాడి చేయగా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న దృశ్యం

## సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో

# క్యాన్సర్‌వ్యాధికి వైద్యసేవలు

## మంత్రి హరీష్‌రావు



ప్రభుత్వ ఆసుపత్రిలో కిమోథెరపి కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

**ప్రభాతవార్త ప్రతినిధి సిద్దిపేట :** అంతుచిక్కని మాయరోగానికి గురై మానసికంగా కృంగి కృషించిపోతున్న అభాగ్యులకు చల్లటి కబురును రాష్ట్రమం త్రి తన్నీరు హరీష్‌రావు అందించారు. ఇక ఈ మాయరోగంతో మనోవ్యాధికి గురవుతూ ఆరోగ్యం పూర్తిగా క్షీణించకుండా మనోధైర్యంతో మనుగడ సాగించేందుకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో నాలుగు పడకలతో కూడిన చికిత్స కేంద్రాన్ని ఆయన ఏర్పాటు చేయిచారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు బలోపేతం చేసే దిశలో భాగంగా ముందడుగు వేస్తూ వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులు తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తుందని చెప్పారు. ఈ తరుణంలో క్యాన్సర్ పేరు చెపితేనే గుండెపగిలే బాధతో కృంగి కృషించిపోతున్న బాధితులకు ఊరట కలిగించేలా ఈ నిర్ణయం తీసుకుని సిద్దిపేట ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు నాలుగు పడక మంచాలను ఏర్పాటు చేసి కీమోథెరపి చికిత్సను అందించబోతున్నట్లు హరీష్‌రావు ప్రకటించారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడిన బాధితులు వ్యయప్రయాసాలకోర్చి రాజధాని నగరమైన హైదరాబాద్ నగరానికి విచ్చేసి చికిత్సలు చేయించుకోవడం ఒక ఎత్తైతే ఎంతో మంది మృత్యుబారిన పడిన సంఘటనలు విన్నాం. అలాంటి పరిస్థితులు సిద్దిపేట వాసులు ఎదుర్కోకుండా వ్యధ చెందకుండా ఉండేలా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఈ ఏర్పాటుకు నడుం బిగించారు.

### మంత్రి హరీష్‌రావు కృషితో క్యాన్సర్‌వ్యాధికి కీమోథెరపి డే కేర్ సెంటర్
### -నాలుగు పడకలతో అందుబాటులోకి రానున్న కీమోథెరపి

హైదరాబాద్, వరంగల్ లాంటి ఇతర ప్రాంతాలకు ప్రయివేట్ ఆసుత్రులకు వెళ్ళకుండా సిద్దిపేటలోనే క్యాన్సర్ వ్యాధికి చికిత్సలను అందించాలనే సంకల్పంతో మంత్రి హరీష్‌రావు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోనే క్యాన్సర్‌వ్యాధిపై తొలి అడుగులు వేసారు. ఎం ఎస్‌జి నిమ్స్‌లో ఉండే ప్రత్యేక వైద్యబృందంతో నాలుగు పడకమంచాలతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఇప్పటికే ఈ సౌకర్యాలతో ఆసుపత్రిలో సిద్ధం చేయడం జరిగింది. ఈ కీమోథెరపి సెంటర్ ప్రతీ రోజు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని హరీష్‌రావు వెల్లడించారు. క్యాన్సర్‌వ్యాధి బారిన వారు మొదట రెండవసారి నిమ్స్‌లో ఎంఎస్‌జిలో కీమోథెరపి చేయించుకుని మూడవసారి మన సిద్దిపేటలో కీమోథెరపి చేయించుకునే అవకాశమున్నట్లు చెప్పారు. అని న్ని సకల సౌకర్యాలతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిద్ధమైన కీమోథెరపి సెంటర్‌ను రెండుమూడు రోజుల్లోనే సిద్దిపేటలో డే కేర్ సెంటర్‌ను హరీష్‌రావు ప్రారంభిస్తారని ప్రకటించారు.

### సాధారణ ఓపి నుండి కీమోథెరపి దాకా..అన్ని ఉచితమే

సిద్దిపేట మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రిలో చిన్నవైద్యం నుంచి పెద్దవైద్యం దాకా అన్ని రకాల సేవలు ఉచితంగానే అందుబాటులోకి వచ్చాయి. సాధారణ జ్వర లక్షణాలు ఉన్న బాధితుల నుండి ప్రమాదకరమైన క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధుల చికిత్సలకు సిద్దిపేట పెద్దాసుపత్రి కేరాఫ్‌గా మారింది. కార్పోరేట్ ఆసుపత్రులు ప్రాంతీయ ఆసుపత్రులకే పరిమితమైన క్యాన్సర్ కీమోథెరపి ఇపుడు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరంభం కానున్నాయి. ప్రయివేట్ ఆసుపత్రిలో ఒక్కసారి కీమోథెరపి చేయించాలంటే ఒక్కసారికి 10వేలరూపాయల నుండి 20వేల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. వీటికి తోడు బాదితులు హైదరాబాద్‌లో ఉండటానికి వసతి, భోజనం, రవాణా ఖర్చులు అదనం. కానీ సిద్దిపేట ఆసుపత్రిలో పూర్తిగా కీమోథేరపి వైద్యసేవలు ఉచితంగా చేయనున్నారు. స్థానికంగానే వైద్య సేవలు ఉండడంతో బాదితులకు ఎలాంటి అదనపు ఖర్చులు ఉండబోవు. బాదితుల ఆర్ధిక బాదలు, ఇబ్బందులు తొలగించడానికి మంత్రి హరీష్‌రావు ఈ మనోధైర్యమైన నిర్ణయానికి తెస్తున్నారు.

### తీరనున్న ఆర్థిక బాధలు..వ్యయ ప్రయసలు

క్యాన్సర్ పేరు వింటేనే మనసు కదిలించే బాద, వ్యాది వచ్చిన నుండి ఎన్నో వ్యయ ప్రయసలు, బతుకే బారం అవుతున్న కుటుంబాలకు ఈ వ్యాది పెద్ద గురిబండగా మారింది. వ్యాది వస్తే హైదరాబాద్ వెల్లి ప్రయివేట్ ఆసుపత్రికి వెల్తే ఆర్థిక పరిస్థితి అడ్డు.. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెల్తే తగ్గుతుందో లేదో అనే భయం లాంటి ఎన్నో పరిస్థితులు చూస్తుంటాం. ఆ పరిస్థితి రావొద్దని హైదరాబాద్ వెలితే ఎన్నో ఖర్చులు, బాదలు.. వ్యాది గ్రస్తులకు మానసికంగా మనోధైర్యం ఇచ్చేందుకు మంత్రి హరీష్‌రావు రాష్ట్రంలోని జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసునత్రిలో హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే క్యాన్సర్ వ్యాధికి కిమోథెరఫీ సెంటర్ ఏర్పాటు చేశారు. దీంతో బాదితులకు హైదరాబాద్ పోయో వ్యయ ప్రయాసలు, ఆర్థిక భారం తీరినట్లే.

### మనసు కదిలించే సందర్బాలు ఎన్నో...

ఎవరైనా చనిపోతే పరామర్శకు వెల్తే ఎలా చనియారు అని తెలుసుకుంటే 10 మందిలో 8 మంది క్యాన్సర్ అని తెలుసుకుంటే 10 మందిలో 8 మంది క్యాన్సర్ అరి దగ్గరి వాళ్ళ ఒక్కో సారి అనారోగ్యంతో ఉన్నారు అని తెలిసి వెల్తే కాన్సర్ అని విన్నాను ఇలా ఎన్నో సందర్బాలు నాకుటుంబంలో కూడా చూస్తున్నానని హరీష్ రావు అన్నారు. ఆ భాద మానసికంగా చెప్పనానిదని, ఇలా ఎన్నో సంఘటనలు నా మనసును కదిలించాయన్నారు. వ్యాది వచ్చిన వారు హైదరాబాద్ వెల్లి వ్యయ ప్రయాసకు లోనవకుండా సిద్దిపేట ప్రజలకు వ్యాది, బాద ఆర్థిక భాదను తీరేలా సిద్దిపేటలోనే మన ప్రభుత్వ ఆసుపత్రిలోకి చికిత్స తీసుకొచ్చామన్నారు. ప్రజలకు ఇలాంటి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించడం వైద్య శాఖ మంత్రిగా నాకు ఎంతో సంతోషానిస్తుందన్నారు.



కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## కన్నుల పండుగగా వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**పెద్దశంకరంపేట, ఏప్రిల్15 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీ గోదా సహిత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణల మధ్య గోవింద నామ స్మరణతో స్వామి వారి కళ్యాణోత్సవాన్ని పూజారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ దంపతులు స్వామి వారి కళ్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కళ్యాణోత్సవం తిలకించడానికి పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామాల నుండి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. కళ్యాణోత్సవం సందర్భంగా స్వామి వారికి ఉదయమే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్ భారతి మహారాజ్‌లు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రం గంగాధర్‌గౌడ్, దాడిగారి గంగాధర్, మాంకాలి కృష్ణమూర్తి, రాజంగౌడ్, సతీష్‌గౌడ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి..

పెద్దశంకరంపేటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ గోదా సహిత లక్ష్మీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట ఎంపీపీ జంగం శ్రీనివాస్, పట్టణ సర్పంచి సత్యనారాయణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లక్ష్మీ రమేష్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు దత్తు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక డంపులపై మైనింగ్, రెవెన్యూ అధికారుల దాడులు

### 17 లారీల ఇసుక నిలువలు సీజ్



అక్రమ ఇసుక డంపులను సీజు చేస్తున్న రెవెన్యూ అధికారులు

**రామాయంపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** కొన్నేళ్లుగా రామాయంపేటలో జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై రెవెన్యూ మైనింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. శనివారం నాడు మైనింగ్, రెమెన్యూ అధికారులు అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులపై సంయుక్తంగా దాడులు చేశారు. సరైన పత్రాలు లేని కారణంగా ముగ్గురు వ్యాపారులనుండి 17 లారీల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ స్వప్న మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిలువ చేశారనే సమాచారం మేరకు ఈ దాడులు చేశామని ఆమె తెలిపారు. ముగ్గురు వ్యాపారుల దగ్గర సరైన పనరతాలు లేకుండానే నిల్వ చేశారని తేలిందన్నారు. వ్యాపారులు పాత అనుమతి పత్రాలను చూపుతున్నారని, అవి చెల్లవని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌గాని మైనింగ్ అధికారుల అనుమతులు గాని లేకుండా ఇసుకను నిలువ చేయడం చట్టరిత్యా నేరమని తెలిపారు. అక్రమంగా నిలువ చేసిన 17 లారీల ఇసుకను సీజ్ చేశామని, పూర్తి నివేదకను ఉన్నతాధికారులకు పంపి, తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ దాడుల్లో మైనింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ దినేష్‌తో పాటు మైనింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు పౌల్ట్రీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

### రామాయంపేట పీఏసీఎస్ చైర్మెన్ బాదె చంద్రం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రామాయంపేట సొసైటీ పరిధిలోని రైతులు పౌల్ట్రీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని రామాయంపేట సొసైటీ చైర్మెన్ బాదె చంద్రం సూచించారు. శనివారం నాడు నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు రమావత్ పుల్యకు పౌల్ట్రీ లోన్ కింద 12 లక్షలరూపాయల చెక్కును స్థానిక కార్యాలయంలో సీఈవో పుట్టి నర్సింలుతో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం నుండి ఎలాంటి లోన్స్ అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమావత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో 3రోజులపాటు పద్యనాటకోత్సవాలు

**తెలుగుజాతి కళావైభవం వైభోగం పద్యనాటకాలు : తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



పద్యనాటకోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, అనిల్‌కుమార్, గుమ్మడి గోపాలకృష్ణ, సతీష్‌లు

నాంపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : తెలుగుజాతి కళా వైభవాన్ని, వైభోగాన్ని చాటిచెప్పే పద్యనాటకాలు తెలుగువారి స్వంతమని, పద్య నాటకాలు వినోదంతోపాటు సందేశాలను అందిస్తూ సంఘ సంస్కరణలకు వారధిగా నిలుస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 17, 18, 19 తేదీల్లో 3రోజులపాటు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రతీరోజూ రాత్రి 6.15గంటల నుండి వైభవోపేతంగా నిర్వహిస్తున్న పద్యనాటకోత్సవాల బ్రోచర్‌ను డా. కె.వి. రమణాచారి ప్రఖ్యాత రంగస్థల నటుడు కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సంస్థ సభ్యుడు సతీష్‌లతో కలిసి బొగ్గులకుంటలోని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కార్యాలయం ధార్మికభవన్‌లోని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ రంగస్థల నటుడుగా పేర్గాంచిన గుమ్మడి గోపాలకృష్ణ పద్యనాటక ప్రదర్శనలో విశేష ప్రతిభావంతుడు, ఆయనకు ఆయనేసాటని కొనియాడుతూ నాటకరంగానికి అద్భుత వైభవాన్ని తీసుకురావడానికి జిజికె ఫౌండేషన్‌ను స్థాపించి చేస్తున్న కళాసేవ అభినందనీయం, అనితరసాధ్యమని, సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 3రోజుల పద్య నాటకోత్సవంలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచన, గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో సత్యహరిశ్చంద్ర (వారణాసి ఘట్టం నుండి); ఆకెళ్ళ రచన, గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో శ్రీనాధుడు; డా. డి.విజయభాస్కర్ రచన, గుమ్మడి గోపాలకృష్ణ పద్యరచన-దర్శకత్వంలో యోగి వేమన పద్యనాటకాలను ప్రదర్శిస్తున్నట్లు, ప్రధాన పాత్రల్లో కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ నటిస్తున్నట్లు రమణాచారి వివరించారు.



ఉచిత వైద్యం అందించిన వైద్యబృందం

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

తార్నాక, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: శాంతినగర్‌లోని తక్షశిల పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి మంచిస్పందన వచ్చింది. రెండు రోజుల పాటు స్పార్కిల్ దంత వైద్యశాల వైద్య సిబ్బంది సామాజిక సేవాకార్యక్రమంలో భాగంగా పలువురి విద్యార్థులకు వైద్యపరిక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు ప్రతిభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులతో పాటు వారి తల్లి,తండ్రులు, పాఠశాల టీచర్లు సేవందుకున్నారు. ఖరీదైన స్కేలింగ్ కూడా ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మి, హెచ్.ఆర్ భాను, ప్రిన్సిపల్ తనుప్రీత్, ప్రిన్సిపాల్ నవీన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మహిపాల్ రెడ్డి, హెచ్‌ఎం.నాజ్‌మాతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా సేవందించిన వారిలో స్కూల్ పూర్వ విద్యార్థి అమృత కూడా సేవందించారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది: జంపనప్రతాప్



1వ వార్డు బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వృధ్వీనాథ్ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: పేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బోయిన్‌పల్లికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వృద్వీనాథ్ ఆధ్వర్యంలో శనివారం 1వ వార్డు బాపూజీ నగర్ నల్ల పోచమ్మ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్వీనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, రాహుల్, రామారావు, అజీత్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన మహనీయుల జయంతి ఉత్సవాల క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

తార్నాక, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్స్ కృష్ణ అంబేద్కర్, నరసింహ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గత 10 రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. 36టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైన్ మ్యాజ్‌లో టిఎస్‌యూ విన్నర్, రన్నగా విజన్ 60 ఎమ్మెల్యే టీమ్‌లు గెలుపొందాయి. గెలుపొందిన వారిని ఒ.యూ అదనపు ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు అభినందించారు. నిర్వాహకులు గడ్డం ప్రవీణ్, తగరపు ప్రవీణ్, నవీన్, భర త్‌కుమార్, వెంకటేష్, ప్రశాంత్, కల్యాణ్, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి

వనస్థలిపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో డాక్టర్ దాసరి సంతోష్ యాదవ్ నూతనంగా నిర్మించిన శ్రీ సాయి నేత్రాలయ ఐ ఆసు పత్రిని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఈ ఆస్పత్రి అంచలంచెలుగా అభివృద్ధి చెందాలని, రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆయన యాజమాన్యాన్ని కోరారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఉప ముఖ్యమంత్రి టి రాజయ్యను సన్మానిస్తున్న అభిమానులు

## గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నిజాంపేట్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారని, గతంలో కరెంటు కోతలతో అనేక ఇబ్బందులు పడ్డారని, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత కరెంటు కోతలు లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. అణగారిన వర్గాలకు మేలు చేసే విధంగా కృషి చేసిన అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అదే విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసి సీఎం కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారన్నారు. హైదరాబాద్ నగరంలో అనేక ఫ్లై ఓవర్లు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపి ప్రభుత్వం దేశ సంపదను, అంబానీ, అదానీకు దోచి పెడుతోందని, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సీబీఐ, ఐటీ, ఈడీ దాడులతో హింసిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, బీఆర్‌ఎస్ నాయకులు రంగరాయ ప్రసాద్, కొలన్ గోపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సోమేయష్ యాదవ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గంపల బస్తీలో రంజాన్ తోఫాల పంపిణీ



తోఫాలను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి గంపల బస్తీలోని మసీదు వద్ద పేద ముస్లింలకు శనివారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ మాసంలో ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకల రూపంలో దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేస్తుందన్నారు. ఈ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా, ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, మసీదు కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## పేదలకు వరంగా మారిన సిఎం సహాయ నిధి : ఎమ్మెల్యే



మంచిరేవులకు చెందిన అశోక్‌కు రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : నిరుపేదలకు సిఎం సహాయ నిధి వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం గండిపేట మండలం మంచిరేవులకు చెందిన అశోక్‌కు రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కును మాజీ సర్పంచ్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మేకల ప్రవీణ్‌యాదవ్, దేవాలయ కమిటీ చైర్మన్ పొన్న రమేష్‌లతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఇప్పించడం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే సీఎం సహాయ నిధికి భారీగా నిధులు వెచ్చిస్తున్నారన్నారు. సమైఖ్య పాలనలో ఏడాదికి 20మందికి మాత్రమే వచ్చేవని, ఇప్పుడు ఏడాదికి వెయ్యి మంది వరకు ఇప్పించడం జరుగుతుందన్నారు.

## మహిళా పోలీసులు అధైర్య పడకుండా ధైర్యంతో ఉద్యోగం చేయాలి : సిపి సి.వి.ఆనంద్



సమావేశంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్,పోలీస్ ఉన్నతాధికారులు,మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టెక్చర్స్ లిమిటెడ్ డైరెక్టర్లు

చార్మినార్,ఏప్రిల్ 15 ప్రభాతవార్త : నేడు మహిళలు అన్ని రంగాలలోను ముందుంటున్నారని, నగర పోలీస్ శాఖలో 11.5 శాతం మహిళా మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. పాతబస్తీ పెట్లాబుర్జులోని సిఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టెక్చర్స్ లిమిటెడ్ సంస్థ పోలీస్ మహిళా అధికారులు మహిళా పోలీసుల చిన్నారుల కోసం నిర్మిస్తున్న క్రష్ భవనానికి సిపి సి.పి.ఆనంద్ శనివారం భూమి పూజ చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో మహిళలు పని చేయటం చాలా కష్టమని,అయినప్పటికి మహిళా పోలీసులు అధైర్య పడకుండ ధైర్యంతో ఉద్యోగాలు చేయాలని తెలిపారు.పెట్లాబుర్జు సిఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు నిర్మించనున్న క్రష్ భవనం నవంబరు 14వ తేదీ నాటికి పూర్తివుతుందని,సిఏఆర్‌లో ఉన్న 600 మంది మహిళా పోలీస్ అధికారులు,మహిళా పోలీసులు, సౌత్ జోన్,సౌత్ ఈస్ట్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు క్రష్ భవనం ఎంతోగానో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. మహిళా పోలీసులు తమ చిన్నారులను క్రష్‌లో వదిలి పెట్టి డ్యూటీలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో తమ వెంట పిల్లలను తీసుకెళ్ల వచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టెక్చర్స్ లిమిటెడ్ డైరెక్టర్లు పమిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ రవిరెడ్డి, మంజుల రెడ్డి, నగర పోలీస్ అదనపు కమిషన్ ఎ.ఆర్.శ్రీనివాస్‌రావు,సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సిపి ఎం.శ్రీనివాస్, డిసిపి శిరీష రాఘవేంద్ర,సౌత్ జోన్ డిసిపి సాయి చైతన్య,చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్,ఇన్‌స్పెక్టర్ గురునాయుడు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మాదిగల అభ్యున్నతి కోసం కృషి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిక్కా సంస్థ చైర్మన్ రాగటి సత్యం,అధ్యక్షుడు భవానికుమర్‌లు

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్తః నిరుపేద మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడానికి సహకరించడానికే తాము డిక్కా సంస్థను ఏర్పాటు చేశామని ఆ సంస్థ చైర్మన్ రాగటి సత్యం తెలిపారు. శనివారం బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాగటి భవాని కుమార్‌తో కలిసి మాట్లాడారు. అణగారిన కులాల పారిశ్రామిక నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి (డిక్కా) పేరుతో రిజిస్టర్ చేయబడిన తమ సంస్థ ద్వారావ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభ్యున్నతి కోసం విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామ స్థాయిలలో ప్రజా చైతన్య కార్యాక్రమాలు, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు డిక్కా సహకారం కోసం బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌లోని తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

**ఈనెల 22న దళిత చైతన్య సదస్సు..** ఈనెల 22న డిక్కా సంస్థ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ మహనీయులకు నివాళి అర్పించేందుకు మహసభ, దళిత చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సంస్థ సభ్యులు డాక్టర్ ఎం. శివకుమార్ లాల్, జి. నర్సింగ్‌రావు, బి. కృష్ణంరాజు, కే. గాంధీ కుమార్‌లు పాల్గొంటారని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: బీఆర్‌ఎస్

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ వెంకటేశ్వరనగర్ కాలనీలో పద్మారావునగర్ బీఆర్‌ఎస్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ గల నాగదేవత దేవాలయం పున: ప్రతిష్టాపనకు సొంత నిధులతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్ణయించారు. ఇందుకోసం ఆలయాన్ని సందర్శించారు. కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు త్వరలోనే పరిష్కరించబడతాయని పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యాక్రమంలో జలమండలి డీజీఎం వై. కృష్ణ, ఏఈ ఆంజనేయులు, నవీన్, సునీత, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, నేతలు వెంకటేషన్‌రాజు, ముక్కశ్రీను, లంబు శ్రీను, వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో మహిళా క్రికెట్‌కు ఆదరణ లభిస్తుంది

**యువ మహిళా క్రికెటర్ గొంగడి త్రిష**



ఫుడ్ పెస్టివల్‌లో పాల్గొన్న యువ క్రికెటర్ గొంగడి త్రిష

హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: దేశంలో రోజురోజుకు మహిళా క్రికెట్‌కు మంచి ఆదరణ లభిస్తుందని యువ మహిళా క్రికెటర్ గొంగడి త్రిష అన్నారు. అండర్ 19 విమెన్ వరల్డ్‌కప్ జట్టులో సభ్యురాలిగా ఉండటం చాలా ఆనం దంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా క్రికెటర్లకు మరింత చేయూత ఇవ్వాలని కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ బం జారాహిల్స్‌లో ఐపిఎల్ థీమ్‌తో రీజెన్సీ కాలేజీ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్‌ఫెస్టివల్‌కు ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిషను కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఐపిఎల్ థీమ్‌పై అహారపు పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యంతోపాటు వారికి ప్రాక్టికల్‌గా ఎంతో ఉప యోగకరంగా ఉంటుందన్నారు. క్రికెట్ స్టేడియం, పిచ్, క్రికెట్‌బాల్స్, బ్యాట్స్ థీమ్స్‌తో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు 100రకాల ఫుడ్స్‌ను వండి వార్చారు. విద్యార్థులు తయారు చేసిన వివిధరకాలైన ఆహారపు రుచులను యువ మహిళా క్రికెటర్ త్రిష ఆస్వాదించి అభినందించారు.

## హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యత

**సామాజిక కార్యకర్త, సిల్వర్ డ్రాప్స్ సంస్థల చైర్మన్ జె.శ్రీనివాసరావు**

సరూర్‌నగర్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: హెల్మెట్‌ను ధరించడం నిబంధనగా కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించాలని సామాజిక కార్యకర్త, సిల్వర్ డ్రాప్స్ సంస్థల ఛైర్మన్ జె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ట్రాక్స్ ఎస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో సిల్వర్ డ్రాప్స్ హై స్కూల్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులకు నాణ్యమైన హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు హెల్మెట్ వాడకం ఆవశ్యకతపై నిర్వహించిన ద్విచక్ర వాహనాల ర్యాలీని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, ట్రాక్స్ ఎస్ సొసైటీ సంస్థ ఇంఛార్జి ఆరాధనలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువైన ప్రాణాలను ద్విచక్ర వాహనదారులు కాపాడుకోవాలనే సదుద్దేశ్యంతోనే హెల్మెట్ వాడకంపై ప్రచారం చేసి పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాతబస్తీలో విద్యుత్ ఉద్యోగిపై దాడి

చార్మినార్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : విద్యుత్ ఉద్యోగిపై దాడి జరిగిన సంఘటన శు క్రవారం డబీర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కధనం ప్రకారం.. మొగల్‌పుర విద్యుత్ సబ్ స్టేషన్‌లో మహ్మద్ ఆరిఫ్ ఆర్టిజన్ గ్రేడ్ 3గా పని చేస్తున్నాడు.కాగా శుక్రవారం ఆర్టిజన్ మహ్మద్ ఆరిఫ్ దారుషిఫాలోని సయ్యద్ ముంతజార్ ఇంట్లో విద్యుత్ మీటర్‌లో బిల్లు తీయటానికి వెళ్లాడు.అదే సమయంలో ఇంటి యజమాని సయ్యద్ ముంతజార్,విద్యుత్ ఉద్యోగి మహ్మద్ ఆరిఫ్‌ల మధ్య వివాదం జరిగింది.సయ్యద్ ముంతజార్ మహ్మద్ ఆరిఫ్‌పై దాడి చేశాడు.ఆర్టిజన్ మహ్మద్ ఆరిఫ్‌పై దాడి జరిగిన విషయాన్ని మొగల్‌పుర విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇజి.ఎల్.ఎన్. రాజు డబీర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాలి

**కార్పోరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి**



ముస్లి సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న కార్పోరేటర్

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : పేదలు కూడా సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కెసిఆర్ కులమతాలకు అతీతంగా అన్ని పండుగలకు కానుకలను అందజేస్తున్నారని సనత్‌నగర్ డివిజన్ కారో ్పరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సనత్‌నగర్ డివిజన్‌లోని జాఫ్రి మసీద్ ప్రాంగణంలో జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి విచ్చేసి పంపిణీ ముస్లిం సోదరులకు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, జాఫ్రి మజీద్ సదర్ సయ్యద్ నొమనుద్దీన్, సరాఫ్ సంతోష్, ఖలీల్‌బేగ్, జమీర్, అబ్రార్, వాసిం పాల్గొన్నారు.

## నీటి దానం గొప్పది : శ్రీగణేష్



టీచర్స్‌కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీగణేష్

తిరుమలగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు పరిధి టీచర్స్‌కాలనీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని శ్రీగణేష్ అన్నారు. శనివారం టీచర్స్‌కాలనీ సభ్యుల విన్నపం మేరకు శ్రీగణేష్ ఆధ్వర్యంలో 17వ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో కన్న మంచినీటి దానం గొప్పదన్నారు. మండుతున్న వేసవిని పరిగణలోకి తీసుకొని కాలనీ సభ్యుల విన్నపం మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్‌కాలనీ అధ్యక్షులు బిక్షపతి రెడ్డి, కాలనీ ససభ్యులు శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, ఆనంద్ రావ్, శ్రీధర్ రెడ్డి, మంజూ, భార్గవి, హన్మంత్ రెడ్డి, మాధవరావ్ తదితరులు పాల్గొన్నారు.

## మే 6నుంచి 8వరకు "గొల్లకలాపం"పై కార్యశాల



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వసుంధర, వేమరాజు విజయ్‌కుమార్, సుధామాల తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: కలాపప్రక్రియ కూచిపూడి నాట్యప్రత్యేకత ఎన్నో శతాబ్దాలు ప్రాచుర్యం పొందిన భామాకలాపం ఒక కలాప ప్రక్రియ. 18వ శతాబ్దానికి చెందిన గొల్లకలాపానికి అంతటి ప్రాచుర్యం కలిగించాలనే ఉద్దేశ్యంతో ప్రముఖ సాంస్కృతి సంస్థ నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల్లో భాగంగా మే 6నుంచి 8వరకు గొల్లకలాపంపై కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్, సమన్వయ కర్త నిష్ఠల సుధామాల తెలిపారు. ఈమేరకు శనివారం సమితి కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ జి.వసుంధర చేతులమీదుగా గోడపత్రిను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అభిరుచి కలిగిన నృత్య గురువులు, యువకళాకారులు, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీకృష్ణతెలుగు భాషా నియలయంలో రిగే ఈవర్క్‌షాప్‌లో ఆసక్తిగల వారు సంప్రదించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో నృత్యగురువులు రేణుకాప్రభాకర్, శ్రీలత వాణీరమణలు పాల్గొన్నారు.

## ప్రజలకు కనీస వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: ప్రజలకు కనీస వసతులను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తూ అభివృద్ధి పనులు జరిపిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 5, 24, 25, 26 డివిజన్లలో రూ.5.65 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో ప్రజలు కోరుకుంటున్నట్లే మౌళిక సదుపాయాలను కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిఇ అశోక్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, రామిడి కవిత రాంరెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వివాదం.. ఘర్షణ**

అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా బిఆర్‌ఎస్‌కు చెందిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి వర్గీయులు, కాంగ్రెస్‌కు చెందిన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. శిలాఫలకాల వద్ద శంకుస్థాపనలు జరిగే సమయంలో పోటాపోటీగా ఆయా పార్టీల నేతలు తమ పార్టీలకు, నాయకులకు మద్దతుగా నినాదాలు చేశారు. పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న వారు తోపులాటకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగించారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి



గాయత్రినగర్‌లో మెగాస్కూల్‌లో గ్రాడ్యువేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : చదువుతో పాటు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అందించినవుడే భవిష్యత్తులో రాణించగలు గుతారని మెగా స్కూల్ కరెస్పాండెంట్ రఘువీర్‌నాథ్ అన్నారు. శనివారం గాయత్రి నగర్‌లోని మెగా స్కూల్‌లో గ్రాడ్యువేషన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలను, ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ సుచిత్ర పాటెల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మైనార్టీలకు రంజాన్ తోఫాలను అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : రంజాన్ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శనివారం దుర్గానగర్ జమామసీదు వద్ద పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతి కోసం నితరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. అన్ని పండుగలకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, సరికొండ వెంకటేష్, జీవన్ గౌడ్, అతుల్లా, నిసార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఒక వరం

**ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి**

**నర్సాపూర్, ఏప్రిల్ 15. ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ ఎట్టిన కళ్యాణలక్ష్మి, షాధీముబారక్ పథకం పేదింటి ఆడపడుచులకు ఇది ఒక వరంలాంటిదని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని షాధీఖానాలో కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ కె.మల్లేషం లు ముఖ్య అతిథులుగా హాజయ్యారు. ఈ సందర్బంగా పలువురి లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎమ్మెల్సీ మల్లేషం ల చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేవారు. ఈ సందర్బంగా నర్సాపూర్ మండల పరిధిలో 55 మంది అర్హులైన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహాశీల్దార్ ఆంజనేయులు, జడ్‌పిటీసి బాబ్యానాయక్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మాజీ ఎంపిపి వెంకటనర్సింగరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, మైనార్టీ నాయకులు హబీభ్ ఖాన్, సర్పంచ్‌లు గాలి శ్రీరాములు, ఉమ్లానాయక్, బోయిని కృష్ణ, ప్యాట సాయమ్మ సత్యనారాయణ, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జలహనుమాన్ ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు


శ్రీజలాంజనేయస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

**నర్సాపూర్, ఏప్రిల్ 15. ప్రభాతవార్త:**
నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొని జల హనుమాన్ ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపించగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆలయానికి వచ్చిన భక్తులు భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ, రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం, పంచామృ తాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం భక్తుల అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ, రాజు పంతుళ్ళు, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**


ముస్లీంలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేషం తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 15. ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ ప్రభుత్వం సిఎం కెసిఆర్ హాయాంలో మైనార్టీల అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నాడని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని షాధీఖానాలో రంజాన్ పండగ కానుకగా ముస్లీంలకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ కె.మల్లేషంలు హాజరయ్యారు. ఈసందర్బంగా ముఖ్య అతిథులు చేతుల మీదుగా ముస్లీం మహిళలకు బట్టలను పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాయాంలో సిఎం కెసిఆర్ అధ్వర్యంలో అన్ని మతాల వారికి సమన్యాయం చేస్తున్నాడని అన్నారు. ఈమేరకు హిందువులకు బతుకమ్మ పండగకు బతుకమ్మ చీరెలు, క్రిస్టమస్ పండగకు క్రైస్తవులకు బట్టల పంపిణీ చేస్తుండగా ప్రస్తుతం రంజాన్ పండగ సందర్బంగా మైనార్టీ ముస్లీంలకు బట్టలను పంపిణీ చేస్తున్నాడని తెలిపారు. మండల తహాశీల్దార్ ఆంజనేయులు, జడ్‌పిటీసి బాబ్యానాయక్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మాజీ ఎంపిపి వెంకటనర్సింగరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, మైనార్టీ నాయకులు హబీభ్ ఖాన్, సర్పంచ్‌లు గాలి శ్రీరాములు, ఉమ్లానాయక్, బోయిని కృష్ణ, ప్యాట సాయమ్మ సత్యనారాయణ, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైన్ ఆర్ట్స్‌లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానం

**నర్సాపూర్, ఏప్రిల్ 15. ప్రభాతవార్త:.**
నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల కళాశాలలో, పాఠశాలలో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో 6 తరగతిలో చేరడానికి విధ్యార్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల, కళాశాలప్రిన్సిపాల్ బిక్షమయ్య, వైస్ ప్రిన్సిపాల్ చార్లెస్ లు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విధ్యార్థులు మాత్రమే అర్హులని అన్నారు. కాగా పూర్తి వివరాలకు సంబందిత వైబ్ సైట్ లో చూడాలని అన్నారు, కాగా మరిన్ని వివరాలకై 9490957326 ఫోన్ ఎంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని వారు సూచించారు.

**ఎడ్యుకేషన్ ఫీజుల ఇంఎంఐలలో ప్రేక్ష ఎడ్యుటెక్ నూతన ఒరవడికి శ్రీకారం**
హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ప్రేక్ష ఎడ్యుటెక్ ఒక వినూత్న ఒరవడికి నాంది పలికింది. ఎడ్యుకేషన్ ఫీజులను ఈఎంఐలలో చెల్లించడంలో తల్లిదండ్రులకు సహాయపడుతుంది. అధిక విద్యా వ్యయంతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు సహాయం చేయడానికి ఇది రూపొందించారు. జీరో-కాస్ట్ ఫీజు ఫైనాన్సింగ్ సొల్యూషన్‌లను అందించడం ద్వారా తల్లి దండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించి అందరికీ విద్యను మరింత అందుబాటులోకి తీసుకురా వాలని ప్రేక్షఎడ్యుటెక్ భావిస్తోంది.

### ఏపిలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను తలపించేలా

# వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తాం

**ఎమ్మెల్సీ ఓగ్గు మల్లేశం, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెల్లడి**


ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఇంచార్జి ఎమ్మెల్సీ ఒగ్గు మల్లేశం కుర్మ

**కౌడిపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**
అతి కొద్ది రోజుల్లోనే కాళేశ్వరం జల్లాలతో నియోజక వర్గంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను మరిపించే విధంగా వ్యవసా య రంగాని అభివృద్ధి పర్చితీరుతానని ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి హామి ఇచ్చారు. శనివారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఓ ప్రయివేట్ పంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభను మండల పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు అధ్యక్షతన నిర్వహించగా మెదక్ జిల్లా ఇంచార్జి ఎమ్మెల్సీ ఒగ్గు మల్లేశం ముఖ్య అతిథిగా హాజరైనారు. ముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కౌడిపల్లి పోచమ్మ ఆలయం నుండి కార్యకర్తలు, ప్రజ ప్రతినిధులు భారీ ర్యాలీ ద్వారా ఆత్మీయ సమ్మేళన సభ వరకు ఊరేగింపుగా తీసుకోచ్చి స్వాగతం పల్కినారు. కాగా భారీ ర్యాలీలో ఒగ్గు కళాకారులు నృత్యంతో కార్యకర్తలను ఆకర్షించుకున్నారు. ఆత్మీయ సమ్మేళన సమావేశంలో జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ ఒగ్గు మల్లేశం మాట్లాడుతు దేశంలో ఏక్కడ లేని విధంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజేక్టు ద్వారా 50 లక్షల ఎకురాలకు సాగునీరు అందించి ఆపార భగీరథుడని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి మాట్లాడుతు వృద్దులకు, వితంతువులకు, పేద కుటుంబ నీరుపేద వధువులకు నేను ఉన్నానని భరోస ఇచ్చిన మహానుభావుడు మన సిఎం అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేసే కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి, మత ప్రచారం తప్ప అభివృద్ధిని ఏరగని బిజేపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌లు సిఎంపై విమర్శలు చేసి జైళ్ల కెళ్లి వచ్చినారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం రాష్ట్ర పాలన చేసేది బిఆర్ఎస్ పార్టీయేనని తెలంగాణ రాష్ట్రం బిఆర్ఎస్ కంచుకోటను బద్దలు కొట్టే దమ్ము ప్రతిపక్ష పార్టీలకు లేదని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడు మాట్లాడుతు బిజేపి, కాంగ్రెస్ పార్టీలు సోషల్ మీడియతో తప్పుడు ప్రచారాలు చేయడంతో పాటు దౌర్జనాలకు పాల్పడుతున్నందున, తనకు అనుమతి ఇస్తే బిఆర్ఎస్ సోషల్ మీడి య ప్రతినిథులను పటిష్ట పర్చి ఎదురు దాడులకు సైతం సిద్దం చేస్తానని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది అభివృద్ధి పర్చిన ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డిని మూడవ సారి లక్ష మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా గ్రంథాలయ చైర్మెన్ చంద్రాగౌడు, ఎంపిపి రాజునాయక్, శివ్వంపేట, కౌడిపల్లి ఆత్మకమీటీ చైర్మెన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వైస్ ఎంపిపి బోర్ల నవీన్ గుప్త, జెడ్పి కోఆప్షన్ మెంబర్ మన్సూర్ అలీ, కౌడిపల్లి కోఆప్షన్ మెంబర్ హైమద్, మండల సర్పంచు ఫోరమ్ అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర్లు రెడ్డి, మండల ఎ ఎంపిటీసిల ఫోరమ్ అధ్యక్షులు గుంజరి ప్రవీన్‌కుమార్, మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మెన్ బాన్సువాడ గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మెన్ చిలుముల చిన్న చిన్నం రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, దుర్గారెడ్డి, నాయికోటి రాజు, నాయికోటి శ్యాంసుందర్ రావు, నర్సింహ్మారెడ్డి, నవీన్ రావు, ఆర్య వైశ్య సంఘం జిల్లా కార్యదర్శి కౌడ శ్రీనివాస్ గుప్త, ఆయా గ్రామాల నుండి విచ్చేసిన ఎంపిటీసిలు, సర్పంచులు, సోషల్ మీడియా ప్రతినిథులు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.


రాహుల్‌కు నివాళి అర్పిస్తున్న ఈటల రాజేందర్

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**హుస్నాబాద్, ఏప్రిల్16, ప్రభాతవార్త**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన హుస్నాబాద్ పట్టణానికి చెందిన మోతె రాహుల్ కుటుంబాన్ని శనివారం రోజున మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్బంగా కన్నీరు మున్నీరుగా విలవిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి తన వంతుగా అండగా ఉంటానని బరోసా ఇచ్చి మృతునికి నివాళి అర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు సన్నీల్లా వెంకన్నకు ఓపెన్ హాట్ సర్జరీ జరగగా ఆయనను సైతం పరామర్శించి వరంగల్‌లో నిరుద్యోగ మార్చ్‌కు తమ పార్టీ శ్రేణులతో కలసి వెల్లారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలి

**కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి**


మాట్లాడుతున్న సత్యనారాయణచారి

**హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్16, ప్రభాతవార్త**
విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సత్యనారాయణచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోజున పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు, కొన్ని కుల వృత్తులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు గానే తమ బ్రతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న, చిన్న యంత్రాలు, వెల్డింగ్, కార్పెంటింగ్, పిండిగిర్ని లాంటి పరిశ్రమలను కుటీర పరిశ్రమములుగా గుర్తించి తమకు 200ల యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలన్నారు. లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో త్వరలోనే విశ్వకర్మ పరిషత్ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసి నిరాహార దీక్షకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎగ్గోజు దామోదరచారి, కనకచారి, చంద్రమౌళి, నాగభూషణాచారి, ఎగ్గోజు సుదర్శనచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించకుంటే సహించేది లేదు

**-ఎంపీపీ మంజుల కాశీనాథ్**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల కాశీనాథ్

**కొల్చారం, ఏప్రిల్15 ప్రభాతవార్త:** కొల్చారం మండలంలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుంటే సహించేది లేదని, ఈ నెల 8వ తేదీన వరిగుంతం గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో తనను అవమానపరిచారని కొల్చారం ఎంపీపీ కోరబోయిన మంజుల కాశీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎనగండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆమె మాట్లాడుతూ జెడ్పీటీసీ సొంత గ్రామం వరిగుంతంలో ఈ నెల 8వ తేదీన అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకంపై ప్రోటోకాల్ పాటించకుండా తన పేరును ముద్రించకపోవడం విడ్డూరమని, ఎంపీపీ మహిళ అని చిన్నచూపు చూశారన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితారెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా అంబేద్కర్ జయంతి వరకు మార్చాలని సూచించగా, నేటి వరకు మార్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునుముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

## మెదక్ పట్టణంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహణ

**మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్15 ప్రభాతవార్త:** రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు శనివారం మెదక్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏకె. గంగాధర్‌రావు ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని 29వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఫ్జల్, కరుణాకర్, ఈశ్వర్, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** మండల పరిధి మదూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి సేవా స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ మైనంపల్లి రోహిత్ బాధిత కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సహయం పంపగా స్వచ్ఛంధ సంస్థ సభ్యులు వారికి అందించారు. సర్పంచ్‌లు రాజిరెడ్డి, నర్సమ్మ, సభ్యులు జీవన్, రమేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


నాటిన మొక్కలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో శైలేష్

## మొక్కల పెంపకం సంతృప్తికరం : జెడ్పీ సీఈవో శైలేష్

**కొల్చారం, ఏప్రిల్15 ప్రభాతవార్త:** జాతీయ రహదారికి ఇరు ప్రక్కలా మొక్కల పెంపకం సంతృప్తికరమని జెడ్పీ సీఈవో శైలేష్ అన్నారు. శనివారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్, పోతంశెట్టిపల్లి గ్రామాల్లోని జాతీయ రహదారికి ఇరు వైపులా నాటి మొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం జెడ్పీ సీఈవో శైలేష్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీటి సౌకర్యం కల్పిస్తూ సంరక్షించాలని సూచించారు. మొక్కల సంరక్షణ ద్వారా కాలుష్యం తగ్గుతుందన్నారు. ఇందుకోసం అధికారులు మొక్కల సంరక్షణ కోసం నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీవో మహిపాల్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి విఠల్, ఎఫ్ఏ బాలరాజు తదితరులు ఉన్నారు.

## పార్టీ భీమా చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


పార్టీ భీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, ఏప్రిల్15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామానికి చెందిన పలువురికి బీఆర్ఎస్ పార్టీ ప్రమాద భీమా చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శనివారం కౌడిపల్లిలోని ఆయన స్వగృహంలో అందజేశారు. సంగాయిపేటకు చెందిన బ్యాగరి సుధాకర్, దాకె గోపాల్, బద్రి గంగారాంలు ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ తరపున 2 లక్షల రూపాయల చొప్పున భీమా చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను వారి కుటుంబ సభ్యులు లలిష, మంజుల, లక్ష్మీలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కొల్చారం మండల గౌడ సంఘం అధ్యక్షులు గజిని వెంకట్‌గౌడ్, కౌడిపల్లి మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సార రామాగౌడ్ పాల్గొన్నారు.

## పాచి బండ్ల ఊరేగింపుతో ముగిసిన బేతాళ స్వామి జాతర


బేతాళ స్వామికి పాచి బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, ఏప్రిల్15 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న బేతాళ స్వామి జాతర పాచి బండ్ల ఊరేగింపుతో శనివారం ముగిసింది. నాలుగు రోజుల పాటు నిత్యం బోనాలతో ప్రత్యేక పూజులు అందుకున్న బేతాళ స్వామి మరో ఐదు రోజుల పాటు బండ్ల ఊరేగింపు, వినోద కార్యక్రమాలు, లంకా దహనం, పాచి బండ్ల ఊరేగింపుతో జాతరకు ముగింపు పలికారు. నిత్యం వేలాది మంది భక్తులతో నిరాజనాలు అందుకున్న బేతాళ స్వామి శనివారం ముగింపుతో భక్తులు అధిక సంఖ్యలో హాజరైన బేతాళ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. శనివారం ఉదయమే బేతాళ స్వామి ఆలయం చుట్టూరా పాచి బండ్లను ఐదు సార్లు ప్రదిక్షణలు చేయిచుయి, అటు తరువాత అల్లాదుర్గం నడిబొడ్డున గల దుర్గమ్మ దేవి ఆలయం వరకు చేరుకొని ఆలయం చుట్టురా ఐదు సార్లు బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అల్లాదుర్గం చివరలో ఉన్న పోచమ్మ దేవాలయం చుట్టూ బండ్ల ఊరేగింపు నిర్వహించి జాతరకు ముగింపు పలికారు. జాతర బండ్ల ఊరేగింపు ముందు డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాలు అలరించాయి. బండ్ల ఊరేగింపు తిలకించేందుకు అల్లాదుర్గం పట్టణవాసులే కాకుండా మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెనోటీసు

**హత్నూర ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** జూనియర్ పంచాయతీ కార్యాదర్శులకు రెగ్యూలరైజ్ చేయడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యంను నిరసిస్తూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు హత్నూర మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యాదర్శులు శనివారం హత్నూర ఎంపిడిఓ శారదదేవికి సమ్మెనోటీసును అంజేశారు. హత్నూర మండలంలోని వివిద గ్రామపంచాయతీలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఓ కార్యలయంలో, ఎంపిడిఓకు సమ్మెనోటీసును అందజేశారు. తమకు రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం విధించిన గడువు ఈనెల 11తేదితో ముగిసిందని అన్నారు. అయిన ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడానికి ఇంతవరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని వారు నోటీసులో పేర్కొన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సమ్మెనోటీసు అందజేసినట్లు మండలం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పెర్కొన్నారు.


ఎంపిడిఓకు సమ్మెనోటీసు అందజేస్తున్న జూనియర్ పంచాయతీకార్యాదర్శులు

## మూల్యాంకన డబ్బులు చెల్లించాలి

**-టిపిటిఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల మూల్యాంకన డబ్బులు వెంటనే చెల్లించాలని టిపిటిఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సప్లమెంటరీ మూల్యాంకన డబ్బులు ఇప్పటి వరకు చెల్లించలేదని, అవి వెంటనే చెల్లించడంతో పాటు ఉపాధ్యాయులపై కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను కొట్టివేసే ఈ వేసవిలోనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్, రాష్ట్ర నాయకులు పద్మయ్య, నారాయణ, పృద్వీదర్‌రావు, రాములు, సుధాకర్, కర్ణాకర్‌రెడ్డి, శివాజీ, సురేష్, శ్రీనివాస్, రవికిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


కేసీఆర్, మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలిభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

**సిద్ధిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
గత కొంత కాలం కలెక్టర్ కార్యాలయంగా కొనసాగిన అంబేద్కర్ భవన్ అభివృద్దికి మంత్రి హరీష్‌రావు రూ 1కోటి మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దళిత సంఘాల నాయకులు సిద్దిపేటలోని అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాకి ఆనంద్, రవిందర్, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గ్యదరి రామస్వామి, మాల సదర్ సంఘం అధ్యక్షుడు తండ భూమయ్య, కుల సంఘ పెద్ద మనుషులు మహంకాళి, తెరాస నేతలు బత్తుల శ్రీనివాస్, భూమలింగం, రాజు, కనుకమల్లయ్య, వెంకట్, మల్లేశం, బాలకిషన్, సురేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం


పరీక్ష హాలును పరిశీలిస్తున్న అన్నపూర్ణ

**హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్16, ప్రభాతవార్త**
తెలంగాణ మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాల)లో నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు పట్టణంలోని మోడల్ స్కూల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని చీఫ్ సూపరిండెంట్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు అన్నపూర్ణ తెలిపారు. ఈ మేరకు 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఉదయం 10గంటల నుండి 12వరకు సాగుంతుందని, అనంతరం మద్యాహ్నం 2నుండి 4గంటల వరకు 7,8,9,10వ తరగతులో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్లతో గంట ముందు సెంటర్ వద్దకు రావాలని సూచించారు. ఈ పరీక్షకు డిపార్మెంటల్ ఆఫీసర్‌గా బదావత్ చంద్రశేఖర్ ఉంటారన్నారు.

## డి.ధర్మారం గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటి ఎన్నిక


కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

**రామాయంపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త ః**
రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామ కాంగ్రెస్ కమిటీని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ అద్యక్షుడుగా బండారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నక్కని రాజు, కోశాధికారి వడ్ల రవి, ప్రధాన కార్యదర్శి దూదేకుల షాదుల్, కార్యదర్శి కురేశి గౌస్, సలహాదారులు కర్రోల్ల రాజు తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్యామ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి. నాయకులు ఉడుత రాజేశం, రామగౌడ్, బండారి కిషన్, ద్యాగల కుమార్, కాట్రియాల రాజు పాల్గొన్నారు.

**హార్టికల్చర్ ఫెసిలిటీ ఆవిష్కరణ**
ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ తమ బాచుపల్లి శాఖలో అతిపెద్ద పాలీహౌస్ సదుపా యం ఒక కొత్త ఆడిటోరియంను ఆవిష్కరించారు. హార్టికల్చర్ పాఠ్య ప్రణాళికకు లిటిల్ గ్రీస్ ఫింగర్స్ అనిపేరు పెట్టారు. ఇదిగ్రేడ్ 1నుండి 10వరకు విద్యార్థులకు బోధించబడుతుంది. ముఖ్య అతిథిగా క్యాంపస్‌టూర్ చేసి విద్యార్థులతో ముచ్చటిస్తూ ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లోని విద్యార్థులు అత్యంత ప్రతిభావంతులు హార్టికల్చర్ రోబోటిక్స్ వంటి విశిష్టమైన అంశాలను పరిశీలించడానికి అన్వేషించడానికి నేర్చుకునేందుకు మంచి అవకాశం ఇక్కడ లభిస్తుంది.


రాంసాగర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

## రాంసాగర్‌లో ఘనంగా శ్రీసీతారాముల రథోత్సవం

**రాయపోల్,ఏప్రిల్ 15 ప్రభాతవార్త** రాయపోల్ మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను రథంపై ప్రతిష్టించి గ్రామంలోని ప్రధాన వీదుల వెంట తిప్పారు. ఈ రథోత్సవంలో గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పోటి పడుతూ రథాన్ని లాగారు. గ్రామ యువకులు ఆటపాటలతో అలాగే మహిళలు కోలాటాలు ఆడుతూ అందరిని కనవిందు చేసారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాయల్ ఓక్ స్టోర్ ప్రారంభోత్సవం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** భారత దేశం ఫర్నిచర్ బ్రాండన రాయల్ ఓక్ తన నూతన స్టోర్‌ను శనివారం ప్రారంభించింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం లో ఏర్పాటు చేసిన స్టోర్‌ను సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ, రాయల్టిక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ్ సుబ్రమణియం, మేనేజిం గ్ డైరెక్టర్ మథన్ సుబ్రమణియంలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాయల్టికన ఫర్నిచర్ డైరెక్టర్లు మహేశ్వరి విజయ్, హెడ్ రిటైల్ హెచ్ఎస్ సురేష్, స్టేట్ హెడ్ హైద్రా బాద్ ప్రద్యుమ్న, కరణం, సేల్స్ మర్చండైజింగ్ హెడ్ ప్రశాం త్ ఎస్. కొటియన్ పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట,ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చేరువులో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధి టీ.మాందాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధి మాందాపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు(40) ఎప్పటిలాగే కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి నిద్రించాడు. ఉదయం బార్య లేచి చూసేసరికి నర్సింలు కనిపించకపోవడంతో పోలం వద్దకు వెళ్లాడని అనుకుంది. గ్రామస్తులు పనుల నిమిత్తం చెరువు వైపునకు వెళ్లగా నర్సింలు మృతదేహం కనిపించడంతో వెంటనే కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువులో చేపలు పట్టడానికి వల వేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఆ వలలో చిక్కుకొని నర్సింలు మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమారుడు వంశీ, కూతురు అక్షయలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మాజీ సర్పంచ్ అంత్యక్రియలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపి

**దుబ్బాక, ఏప్రిల్ 15, ప్రభాతవాత్త:**

అక్బర్‌పేటభూపంల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ పెద్ద కుమ్మరి కుంటయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునంధన్ రావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్ రెడ్డిలు వేరువేరుగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ పోతనక రాజయ్య, చౌదర్‌పల్లి గ్రామ సర్పంచ్ కుమ్మరెంకు కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ శేర్ల కైలాసం, ఎంపిటిసి బొల్లారం కనకయ్య, బిఆర్ఎస్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, రొట్టె రాజమల్లు పంతులు, పంజాల శ్రీనివాస్, ర్యాకం శ్రీరాములు, బిజెపి నాయకులు గంబీర్ పూర్ణ చెందర్ రావు, అంబాటి బాలేష్ గౌడ్, అరిగె కృష్ణ, పెద్దొల నవీన్, బానుప్రసాద్ రావు,ఇరుకోటి పర్షరాములు గౌడ్, గోపరి యాదగిరి, నాయకులు, ప్రజలు ఉన్నారు.

## చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా

**దుబ్బాక, ఏప్రిల్ 15, ప్రభాతవాత్త:** అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ పోతనక రాజయ్య వ్యక్తిగత కారణాల వలన బిఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేస్తున్నట్లు శనివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వలన బిఆర్ఎస్ పార్టీలో కొనసాగడానికి ఇష్టం లేక పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

## 108 వాహనంలో మహిళ ప్రసవం

**బెజ్జంకి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన అఖిల అనే మహిళ నెలలు నిండి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించగా 108 సిబ్బంది అఖిలను కాన్పు నిమిత్తం కరీంనగర్ మాత శిశు అసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలోని వీరాపూర్ గ్రామ శివారులో 108 వాహనంలోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటి రాజేంద్రప్రసాద్, ఫైలెట్ పర్షయ్య తెలిపారు. సకాలంలో వచ్చి తల్లి బిడ్డ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పోలీసులు శనివారం అత్యవసర సమయంలో రక్త దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రి, సిద్దిపేట ప్రైవేటు అసుప త్రుల్లో చికిత్స పొందుతున్న మహిళలు, పురుషులు పిల్లలకు అత్యవ సరంగా ఎ పాజిటివ్, ఎబి పాజిటివ్, ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం ఉండగా చిన్నకో దూరు కానిస్టేబుల్ పరుశరాములు, ఏఆర్ కానిస్టేబుల్ భాను, ఏఆర్ కానిస్టేబుల్ మనోజ్‌లు వెంటనే స్పందించి సిద్దిపేట ఎన్ఎస్‌వి బ్లడ్ బ్యాంకు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన కానిస్టే బుళ్లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది

**-ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిలు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని పిహెచ్ఆర్ వెంచర్ బ్రోచర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం కావడంతో సామాన్య ప్రజలు సైతం ధనవంతులుగా మారారన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ వెంచర్ల ఏర్పాటుతో గజ్వేల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.


ఏకెపి ఏపియంకు సమ్మె నోటీసు అందచేస్తున్న విఓఏల దృశ్యం

## ఏపియంకు విఓఏల సమ్మె నోటీసు

**ఝరాసంగం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 17వ తారీఖు నుంచి నిరవధిక సమ్మెకు పూనుకుంటున్నట్లు ఇందిరా క్రాంతి పథకం విఓఏలు ఏపియంకు శనివారం నోటీసు పత్రం అందచేశారు. ఈ సందర్భంగా విఓఏల సంఘం అధ్యక్షులు పద్మారాణి, కారర్యదర్శి నింగమ్మ, ప్రధాన కార్యదర్శి ఖాజామియాలు మాట్లాడుతూ ఐకెపి విఓఏలను పెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 26వేల రూపాయల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. 10 లక్షల సాధారన భీమా, ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సెర్ఫ్ నుంచి ఐడి కార్డు ఇవ్వాలన్నారు. గ్రామ సంఘం గ్రౌండింగ్‌లో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు తమ ఖాతాల్లో క్రెడిట్ అయ్యేలా చూడాలన్నారు. విఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయంచకూడదన్నారు. విఓఏలపై మహిళా సంఘాల ఒత్తిడి అధికమైనందున ఎస్‌హెచ్‌జిలకు విఎల్ఆర్ అభయహస్తం డబ్బులు చెల్లించాలని సూచించారు. ఎస్‌హెచ్‌జి, విఓ లైవ్ మీటింగ్స్‌లను రద్దు చేయాలన్నారు. అర్హులైన విఓ ఏలను సిసిలుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో విఓఏలు సిరాజోద్దిన్, సిద్దప్ప, మొహ్మద్, సోఫియోద్దిన్, మరియమ్మ, వసంత, స్వరూప, నాగమణి, పుష్పలత, బి రాజు, బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జీవ కూటముల జాతరకు జడ్పీటిసి విరాళం


క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతరకు విరాళం అందచేస్తున్న బోడ స్వప్న

**న్యాల్‌కల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామంలో ఈస్టర్ గుట్ట వద్ద శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న 23వ మెథడిస్ట్ క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతర ఉత్సవాలకు జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్ తన వంతుగా 15వేల రూపాయలను విరాళంగా అందచేశారు. శనివారం ఈస్టర్ గుట్ట వద్దకు బిఆర్ఎస్ నాయకులతో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి జాతర నిర్వాహకులకు తన వంతుగా 15వేల రూపాయలను అందచేశారు. ఈ సందర్భంగా జడ్పీ టిసి సభ్యురాలు స్వప్న భాస్కర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగే ఉజ్జీవ కూటముల జాతరకు తరలివచ్చే భక్తులకు తగు సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, నాయకుల స్వామిదాస్, సర్కింట్ పాస్టర్, పాస్టర్లు, నాయకులు రాజారావు, స్వామిదాస్, నర్సింలు, శామ్యూల్, లేమెన్, యూత్ సభ్యులు సునీల్, సలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీరంరగూడలో బసవన్న కాంస్య విగ్రహావిష్కరణ

**-జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ప్రసాది మధు శేఖర్**


మాట్లాడుతున్న జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ప్రసాది మధు శేఖర్

**సదాశివపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తారీఖున పటాన్‌చెరువు నియోజకవర్గంలోని బీరంగూడ కమాన్ వద్ద విశ్వగురువు శ్రీ మహాత్మా బసవేశ్వరుడి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కార్యక్రమానికి వీరశైవులు, బసవేశ్వరుడి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ప్రసాది మధు శేఖర్, ప్రధాన కార్యదర్శి అనిమిశెటివ్వ జయప్రకాశ్‌లు సూచించారు. శనివారం పట్టణంలో స్థానిక విలేఖరులతో మధు శేఖర్ మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు బీరంగూడ కమీన్ వద్ద ప్రముఖుల సమక్షంలో అశ్వరూడ విశ్వగురువు అందరి వాడు మహాత్మా బసవేశ్వరుడి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లోని వీరశైవ లింగాయత్‌లు తమ కుటుంబ సభ్యులతో కార్యక్రమానికి చేరుకుని ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని వినతి చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ బాధ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే స్వచ్ఛ సర్వేక్షన్

**-ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి**


శ్రీనివాస్ కాలనీలో ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆయా శాఖల అధికారులతో ప్రతి నిత్యం ఉదయంయ రెండు కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అక్కడికి అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు అవసరమైతే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారన్నారు. 14 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ప్రతి అధికారి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. వారం రోజులకు ఒక మారు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు సింధు ఆదర్శరెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, జిహెచ్‌హెంసి డిప్యూటీ కమీషనరన బాలయ్య, ఆయా శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంగాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

**మర్కుక్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):** మండలకేంద్రం మర్కుక్‌లో శ్రీ సంకట విమోచన హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ ఆవరణలో దేవాలయం ట్రస్టు గౌరవ అధ్యక్షుడు అప్పాల మాధవశర్మ, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డిల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ నుండి 15 వరకు పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భాస్కర్, ఎంపిటిసి చైతన్యశంకర్‌రెడ్డి, ఆలయ ట్రస్టు చైర్మన్ సాయిని మహేష్, నాయకులు బబ్బూరి సతీష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజు, కార్తిక్‌శర్మ, సుధాకర్‌రెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** వేసవి కాలంలో బాటసారులకు చలి వేంద్రాలతో తమ దాహర్తి తీర్చుకునే అవకాశం ఉంటుందని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ చౌరస్తాలో రామచంద్రాపురం మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం మూలంగా ఎండలు దంచి కొడుతున్నాయని, బాటసారులకు దాహం వేస్తే తమ గొంతులను తడార్పుకునేందుకు ఇబ్బంది పడేవారని, చలి వేంద్రాలతో చల్లని నీటితో తమ గొంతులను తడార్పుకునే అవకాశం ఉంటుందన్నారు. చలి వేంద్రం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంఘం బాధ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు పనుల కోసం ఇంటి బయటకు వెళ్లే సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎండలకు మాడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నగేష్ కురుమ, ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి


కరపత్రికను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మహెందర్‌గౌడ్

**చిన్నశంకరంపేట,ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా సమన్వయ కర్త దేవయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ మహెందర్‌గౌడ్ టీఎస్‌సీపీఎస్‌ఈయూ కరపత్రికను తహసీల్దార్ మహెందర్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే పెన్షన్ కాన్సిట్యూషనల్ మార్చ్ ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లాఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాజ్‌కుమార్, రియాజ్, శ్రీకాంత్,చంద్రయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మోతే లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలల్లో ఎమ్మెల్యే


స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**మిరుదొడ్డి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతేలో జరుగుతున్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మెదక్ ఎంపి ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావులు పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎంపి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే రఘునందన్‌గరవు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి అశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. కార్యక్రమంలో బిజెపి, టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గజ్జల సాయిలు, వల్లాల సత్యనారాయణ, కాలేరు శ్రీనివాస్, సుకురి లింగం, రొట్టె రాజమౌళి, బోరం రాజేశ్వర్, బీంరావు, ఎలుముల స్వామి, దేవరాజు, రఘుపతిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోతె గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవం

**దుబ్బాక, ఏప్రిల్ 15, ప్రభాతవాత్త:** అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవం శనివారం నిర్వహించడం జరిగింది. స్వామి వారి వార్షికోత్సవంలో భాగంగా మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునంధన్ రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్‌లు వేరువేరుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, ఆలయ పంతులు రమేష్ పంతులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందు ఏర్పాటుకు చెక్కును అందచేస్తున్న తహసీల్దార్

## ఇఫ్తార్ విందుకు రూ.1లక్ష అందచేత

**ఝరాసంగం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తమండల కేంద్రమైన ఝరాసంగంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన 1 లక్ష రూపాయల చెక్కును తహసీల్దార్ శ్రీనివాస్ ముస్లిం నాయ కులకు శనివారం అందచేశారు. ముస్లిం మైనార్టీలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండగను పురస్కరించుకుని మహ్మాదీయులు ప్రతినిత్యం నిష్టనియమాలతో రోజాలుఉంటూ ఉంటారు. సాయంత్రం రోజాను విరామం కల్గించేందుకు ఇఫ్తార్ విందులో ఆహారాన్ని తీసుకుంటూ ఉంటారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసుకునేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రూవు మండలానికి 1 లక్ష రూపాయలు మంజూరు చేయగా తహసీల్దార్ శ్రీనివాస్‌నాయబ్ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ రామారావులతో కలిసి ముస్లిం నాయకులు ఎజాజ్ బాబాకు ముస్లిం సోదరుల సమక్షంలో అందచేశారు.

## గొల్లకురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** గొల్లకుర్మల సంక్షేమానికి మన ముఖ్యమంత్రి కేసీర్ ఎంతో కృషి చేస్తున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోగల డబుల్‌బేడ్‌ల వద్ద గల కన్వెన్షన్ హాల్‌లో రెండవ విడత కింద మంజూరైన గొర్రెల పంపిణీ సందర్భంగా గొల్లకుర్మలకు గొర్రెలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గొల్ల కుర్మలకు నారాయణఖేడ్ నియోజక వర్గంలో రెండవ విడత కింద 1284 గొర్రెల యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత కాంగ్రెస్ హయాంలో గొల్లకుర్మల గురించి కాంగ్రెస్ నాయకులు ఆలోచించలేదని అన్నారు. తెరాస ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి నిధులు కేటాయించిన ఘనత మన ముఖ్యమంత్రిదే అన్నారు. గొల్లకుర్మల పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం వారికి గురుకుల పాఠశాలల్లో అవకాశం కల్పించిందన్నా రు. ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ప్రభాకర్, ఉపాధ్యక్షులు మల్‌గోండ పాల్గొన్నారు.

**సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం:**

నారాయణఖేడ్ నియోజవకర్గంలోని గొల్లకుర్మలు శనివారం నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్, ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డిల చిత ప్రటానికి పాలాభిషేకం నిర్వహించారు.

## దళితరత్న అవార్డులు అందుకున్న ప్రముఖులు

**ములుగు, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):** దళిత బహుజనులకు చేస్తున్న సేవలను గుర్తించి ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము నవీన్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ దళితరత్న అవార్డును బహూకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొమ్ము నవీన్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి అవార్డు అందజేసినందుకు సిఎం కెసిఆర్, మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్, కొప్పుల ఈశ్వర్, అంబేద్కర్ ఉత్సవాల వర్కింగ్ కమిటీ చైర్మన్‌లు మేడి పాపయ్య, జంగా శ్రీనివాస్, మాల వైస్ చైర్మన్ రాజలింగం, ఎస్సీ కమిషనర్ చైర్మన్ రాహుల్‌బొజ్జ, ఐఏఎస్ యోగితారాణి, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్, ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్‌లకు తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**దళితరత్న అవార్డు పొందిన మన్నె శేఖర్**

**గజ్వేల్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవీంద్ర భారతిలో జరిపిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన మన్నె శేఖర్‌కు దళితరత్న అవార్డు ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి, జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కొప్పుల ఈశ్వర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌లు మేడి పాపన్న, జంగ శ్రీనివాస్ చేతులమీదుగా అవార్డు తీసుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు. మన్నె శేఖర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానని, దళితులను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చైతన్యపరిచినందుకు దళిత రత్న అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

# అస్తవ్యస్తంగా సిసి రోడ్ల నిర్మాణం

**-రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు.. ఇష్టారీతిన పనితీరు**

**- వార్డులో తాటి చెట్లను తొలగించి రోడ్డు నిర్మాణం**

**-పర్యవేక్షించని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**గజ్వేల్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నా కాంట్రాక్టర్ల పనితీరు వల్ల అస్తవ్యస్తంగా కొనసాగుతుంది. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారు చేసే పనులను చూస్తే అర్థమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సారథ్యంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు చెబుతున్నప్పటికీ కాంట్రాక్టర్లు వారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే... మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలో ప్రస్తుతం కొనసాగుతున్న సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుంది. ఏ వార్డులో చూసినా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తమకు ఇష్టం వచ్చిన విధంగా సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. వీధుల్లో సుమారు 20 ఫీట్ల వరకు సిసి రోడ్డు పోయాల్సి ఉండగా ఒక్కో వార్డులో 16 ఫీట్లు, 14 ఫీట్ల సిసి రోడ్లు పోస్తున్నారు. సిసి రోడ్లు పోసే సమయంలో భూమిని చదును చేయకుండా ఎత్తు వంపులు ఉన్నా సరి చేయకుండా సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. చిన్న చిన్న గల్లీలో సిసి రోడ్లు ఆదరా బాదరాగా పోస్తూ కొన్ని చోట్ల మాత్రం డస్ట్ పోసి రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. సిసి రోడ్లు పోస్తున్న కాంట్రాక్టర్లను మందలించే ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారికి నచ్చిన విధంగా పోస్తున్నారు. అసలే ఎండాకాలం కాగా సిసి రోడ్లను పోసిన తర్వాత క్యూరింగ్ చేయకుండానే వాటిపై మట్టి పోయడంతో సిసి రోడ్లు అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. గల్లీలలో అండర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మునిగిపోయేవిధంగా సిసి రోడ్లు పోయడం వల్ల భవిష్యత్తులో రోడ్లు మరోసారి పగులగొట్టి పైపులు వేయాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్లను అడుగగా సిసి రోడ్ల నిర్మాణం పనుల్లో మాకు గిట్టుబాటు సరిగ్గా కావడంలేదని, మేము పోసే విధంగా పోస్తున్నామని స్థానికులతో అన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్


రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టును తొలగించిన దృశ్యం


సిసి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో గత 60 సంవత్సరాలుగా ఉన్న రెండు తాటిచెట్లను రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ తొలగించడంతో ప్రజ్ఞాపూర్‌కు చెందిన నాచారం ఆలయ డైరెక్టర్ మామిడి నరేష్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు మామిడి సురేష్‌గౌడ్, బూసన్నగారి హరికృష్ణగౌడ్, ఉపేందర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్‌లు సిసి రోడ్డు నిర్మాణం వద్దకు వచ్చి సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీశారు. అసలే కులవృత్తికి దూరమ వుతున్న తమకు సిఎం కెసిఆర్ తాటి వనం, ఈత వనం చెట్లను అందించి ప్రోత్సహిస్తున్నారని, ఇలాంటి సమయంలో 60 సంవత్సరాలుగా ఉన్న తాటి చెట్లను రోడ్డు నిర్మాణంలో తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాటి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే రోడ్డులో పెద్ద చింతచెట్టు ఉందని, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంబాలను తొలగించకుండా రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్లను తొలగించడం కక్షపూరిత చర్య అని, ఇట్టి విషయంపై ఆబ్కారీ సిఐకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సిసి రోడ్ల నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేయడంలేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా దృష్టి సారించి సిఎం కెసిఆర్ ఆశయాలను నెరవేర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.